క్లుప్తంగా

ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

యాడికి: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని వామపక్షాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ఎన్నో ఏళ్ల నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యరంగాల్లో విశిష్ట సేవలందిస్తోందన్నారు. సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయకపోవడంతో సంస్థ సేవలు ఆగి జిల్లా వ్యాప్తంగా ఉన్న పేదలతో పాటు సంస్థలో పని చేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. వెంటనే సంస్థ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని కోరారు. నాయకులు రాముడు, బషీర్ అహమ్మద్, ఆది నారాయణ యాదవ్, బండారు రాఘవ, కుళ్లాయి రెడ్డి, మోహన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి పనులు చూపండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్

గుత్తి రూరల్: గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు చూపాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏపీఓ రమేష్‌తో కలిసి ఉపాధి సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే కొలతల ప్రకారం కూలీ డబ్బులు వచ్చేలా పనులను కల్పించాలన్నారు. పనులు జరిగే ప్రదేశంలో నీడ కల్పించేందుకు టెంట్లు, కూలీలకు మజ్జిగ, తాగు నీరు ఏర్పాటు చేయాలని సూచించారు. టీఏలు లోకేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఈఓఆర్డీ కృషి మరువలేనిది


ఈఓఆర్డీ వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఈఓఆర్డీ వెంకటలక్ష్మి చేసిన కృషి మరువలేనిదని సర్పంచ్‌లు అన్నారు. ఈఓఆర్డీ వెంకటలక్ష్మి పదోన్నతిపై సోమందేపల్లి ఎంపీడీఓగా వెళ్తుండడంతో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, మండల అధికారులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్‌లు సుభాషిణి, నాగమునెమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు ఎంపీడీఓగా ఈఓఆర్డీ జిలాన్‌బాషా
పుట్లూరు: మండలంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న జిలాన్‌బాషా ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. జెడ్పీ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందుకున్న ఆయన పుట్లూరులో బుధవారం రిలీవ్ అయ్యారు.

బండి శూల తిరునాల ప్రారంభం


రామరాజుపల్లిలో బండిశూల రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పామిడి/ పెద్దవడుగూరు: పామిడి మండలం రామరాజుపల్లితో పాటు పెద్దవడుగూరు మండలం కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల్లో ఐదురోజుల పాటు నిర్వహించే సుంకులమ్మ, ముత్యాలయ్యకు సంబంధించిన బండి శూల తిరునాల బుధవారం ప్రారంభమైంది. ముందుగా అంతకుముందు సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయంలో గ్రామదేవతలను శోభాయానంగా అలకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామదేవతలు సుంకులమ్మ, ముత్యాలయ్య విగ్రహాలను చిలకమ్మ పల్లకీ ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. పెద్దవడుగూరు మండలం కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల మీదుగా ఈ తిరునాలను నిర్వహించడం ఇక్కడ అనాదిగా వస్తున్న ఆచారం. ఈ బండి శూల తిరిగి 5వ రోజు(ఆదివారం) రామరాజుపల్లికి చేరడంతో తిరునాల ముగుస్తుంది. పామిడి, యాడికి పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజారోగ్యం గాలికి..

- రోడ్లపైనే మాంసం విక్రమాలు
- నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు

తాడిపత్రి రూరల్: మాంసం వ్యాపారులు ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. కనీస నిబంధనలు పాటించకుండా రోడ్లపైనే మాంసం విక్రయాలు చేపడుతున్నారు. మాంసంపై దుమ్ముధూళి పడుతున్నా, ఈగలు ముసురుతున్నా యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు, సీబీరోడ్డు, నందలపాడు, శ్రీనివాసపురం, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, సంత మార్కెట్, చిన్నబజారు తదితర ప్రాంతాల్లో మాంస విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ఆది, మంగళవారాల్లో విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. పట్టణంలోని చిన్న బజారు, కుమ్మరిగేరిలో మాత్రం రోజూ మాంస విక్రయాలు జరుగుతున్నాయి.


గన్నెవారిపల్లి కాలనీలో మురుగుకాలువ పక్కన మాంసాన్ని వేరుచేస్తున్న దృశ్యం


రోడ్డు పక్కన దుమ్ము, ధూళిలో మాంసాన్ని విక్రయిస్తున్న దృశ్యం

దుమ్ముధూళి పడుతున్నా..

దుమ్ము, ధూళితో నిండి ఉన్నా పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, నంద్యాల రోడ్డుల పక్కన పొట్టేళ్లను కోసి మాంసాన్ని కుప్పలుగా చేసి విక్రయిస్తున్నారు. ఈప్రాంతాల్లో పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. రోడ్డు పక్కన మాంసాన్ని ముక్కలుగా కోసీ తుకాలు వేసి విక్రయానికి సిద్ధంగా ఉంచుతున్నారు. ప్లాస్టిక్ పేపర్లపైన మాంసాన్ని విక్రయానికి ఉంచుతున్నారు. వాటిపై దోమలు, ఈగలు వాలుతూ కొనుగోలుదారులు రోగాలబారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఇవీ నిబంధనలు...

నిబంధనల మేరకు పొట్టేళ్లు, గొర్రెలు, మేకపోతులు పూర్తిగా ఆరోగ్యకరమైనవిగా పశువైద్య అధికారులు నిర్ణయించాలి. మాంసం విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలి. ఈగలు, దోమలు, ఇతర క్రిమి కీటకాలు రాకుండా జగ్రత్తలు తీసుకోవాలి. మాంసాన్ని వేరు చేసే వ్యక్తికి ఎలాంటి అనారోగ్యం, గాయాలు ఉండకూడదు. ప్రత్యేకంగా యునిఫారం ధరించి చేతులకు గ్లౌజులు ధరించాలి. అమ్మకాలను ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే విక్రయించాలి. ఇంత జరుగుతున్నా ప్రజారోగ్య అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

డ్రైనేజీల పక్కనే విక్రయాలు..

గన్నెవారిపల్లి కాలనీలో డ్రైనేజీ పక్కన మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. అక్కడే పొట్టేళ్లను కోసి వ్యర్థాలను కాలువల్లో పారవేస్తున్నారు. డ్రైనేజీల పక్కన కోసిన పొట్టేళ్లను కట్టేలకు వేలాడ దీసి చర్మాలను వేరు చేస్తున్నారు. మంసాలను ముక్కలుగా చేస్తూ తోపుడు బండ్లపై విక్రయానికి ఉంచుతున్నారు. పట్టణంలోని చేనేతకాలనీ, అంబేడ్కర్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న ప్రజలు మాంసం కొనుగోలు కోసం గన్నెవారిపల్లి కాలనీకి వస్తున్నారు. గన్నెవారిపల్లి కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంటోంది.

నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు



ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మాంస విక్రయదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వారికి నోటీసులు పంపాం. విక్రయానికి ఉంచిన మాంసంపై దుమ్ము, ధూళి, ఈగలు, దోమలు వాలకుండా జగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన వాటిని మాత్రమే కోయాలి. వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయరాదు.

–శివరామకృష్ణ, కమిషనర్

కేసు నమోదు

యాడికి: భూతగాదాకు సంబంధించి దాడి ఘటనలో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వివరాలు..వీరన్నపల్లి గ్రామానికి చెందిన కంబగిరికి గ్రామ సమీపంలో 300బి సర్వే నంబరు 1.17 ఎకరాల పొలం ఉంది. ఆ పొలంలో తమకు కూడా వాటా ఇవ్వాలంటూ వీరరమేష్, మరో వ్యక్తి రెండు రోజుల క్రితం కంబగిరి కుమారుడు వరకృష్ణపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు వీరరమేష్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి: వేములపాడు గ్రామం వద్ద బుధవారం సాయంత్రం అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన రవికుమార్, దాసరి విశ్వనాథ్ అనే ఇద్దరు ట్రాక్టర్ యజమానులు పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తుండగా సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

శింగనమల: అర్హులైన వారు మండలంలోని గ్రామ సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బ్రహ్మయ్య బుధవారం తెలిపారు. రేషన్ కార్డులో పేరు మార్పు, లబ్ధిదారుల చేరిక, చిరునామాలో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి: రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డులో ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు బుధవారం దాడికి పాల్పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పుట్లూరు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బ్రహ్మనందరెడ్డిపై తాడిపత్రిలోని రెడ్డివారిపాలెంకు చెందిన ఓబుళరెడ్డి, నాగిరెడ్డి మరో వ్యక్తితో కలిసి దాడి చేశారు. ఓ స్థలం విషయమై దాడి జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్కీముల పేరిట కూటమి సర్కారు స్కామ్‌లు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాయకులు

గుంతకల్లుటౌన్: ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్టుమిషన్ శిక్షణ ముసుగులో రూ.167 కోట్ల భారీ స్కామ్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాయకులు ఆరోపించారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మహిళలకు వృత్తి నైపుణ్యాలను అందించే కార్యక్రమాల్లో కూడా అవినీతికి పాల్పడటం సిగ్గుచేటని వారు విమర్శించారు. గతంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో జైలుకు వెళ్లొచ్చిన చంద్రబాబు ఇప్పుడు బీసీ మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా టెండర్ విలువ రూ.230 కోట్లు కాగా, అందులో రూ.73 కోట్లు ఒరిజినల్‌గా ఖర్చవుతుందని, మిగిలిన రూ.167 కోట్లను పక్కా ప్రణాళిక ప్రకారమే దోచేసేందుకు స్కెచ్ వేశారన్నారు. ఈ స్కామ్‌లో ప్రభుత్వ పెద్దలు, మంత్రి సవిత, అధికారులకు ఎవరి వాటా ఎంతో కూడా నిర్ణయించడం కూటమి సర్కారు తీరుకు నిదర్శనమన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని లేకపోతే తమ పార్టీ తరపున న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని వారు వెల్లడించారు. మున్సిపల్ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు కురుబ లింగన్న, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీయాదవ్, పంచాయతీ,ఎస్టీసెల్, విద్యార్థి విభాగం నియోజకవర్గాల అధ్యక్షులు తిక్కస్వామి, అంజి, అబ్దుల్‌బాసిద్, బాబురావు, టీకే.రంగా, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నైరుతిరెడ్డి పుట్టినరోజు వేడుకలు


హైదరాబాద్‌లో నైరుతిరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


గుత్తిలోని అనాథ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ యువనాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం అమృతవర్షిణి బాలకళ్యాణ (అనాథబాలుర) ఆశ్రమం నందు కేక్‌ను కట్ చేసి వారికి విందును ఏర్పాటు చేశారు. నాయకులు కురుబ లింగా, సాంబ తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి ముని ఆధ్వర్యంలో అనురాగ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. నాయకులు దశరథరెడ్డి, అబ్దుల్‌బాసిద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో ఉన్న నైరుతిరెడ్డిని నియోజకవర్గ సోషల్ మీడియా మాజీ కోఆర్డినేటర్ జయరామిరెడ్డి, వలంటీర్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పవన్, ప్రకాష్, మస్తాన్, జహీర్ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

గుత్తి: పట్టణంలోని కొత్తూరు అనాథాశ్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నేత రామ సుబ్బారెడ్డి, పాత బస్టాండ్‌లోని వెల్డింగ్ రవూఫ్ ఆధ్వర్యంలో గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనాథలకు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, రాష్ట్ర పంచాయతీ వింగ్ సహాయ కార్యదర్శి సీపీ రంగారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రవీణ్‌కుమార్


సురేష్

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డుపై సితార ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. పట్టణానికి చెందిన ప్రవీణ్ కుమార్, సురేష్ బైక్‌పై అనంతపురం రోడ్డు వైపు వెళుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తర లించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు వారిని అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవాలు


యాడికిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్య వైశ్య సంఘం సభ్యులు


పామిడిలో వాసవీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు


వాసవీ దేవి మూలవిరాట్‌కు నుదిటన సూర్యకిరణాలు

గుంతకల్లు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత జయంత్యుత్సవాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి బిందె సేవ, అనుజ్ఞ పుణ్యాహవచనం గావించారు. ఇక కోదండ రామస్వామి ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఆర్యవైశ్య మహిళలు క్షీర కలశాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారి బంగారు విగ్రహానికి ఆవుపాలుతో అభిషేకం చేపట్టారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్ నుదిటిన బొట్టుగా సూర్యకిరణాలు తాకడం విశేషం. సాయంత్రం వాసవీదేవి వేషధారణ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు పోత్సాహక బహుమతులను అందజేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 108 కలశాలతో అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, సహాయ కార్యదర్శి నాగ సుదర్శన్, వాసవీ మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు రాధాదేవి, కృష్ణవేణి, కోశాధికారిణి గీత, యువ జన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, వెంకట్, కోశాధికారి జక్కా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో గాంధీజీ విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం సభ్యులు మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు పవన్‌కుమార్, విశ్వనాథ ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

పామిడి: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని పల్లకీపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కవి కే నారాయణమూర్తి, అధ్యక్షులు ఉపేంద్ర, మాజీ అధ్యక్షులు బీవీ రత్నమయ్య, నల్లయ్య, నాగార్జున, వాసవీ మాతృమండలి సభ్యులు రాజేశ్వరి, నాగవల్లి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.


పెద్దవడుగూరులో కన్యకా పరమేశ్వరిదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి
పెద్దవడుగూరు: మండల కేంద్రంలో బుధవారం కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు నూతన ఆలయ కమిటీ పెద్దలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బినామీ పేర్లు రాస్తే కఠిన చర్యలు

యల్లనూరు: ఉపాధి హామీ పనుల మస్టర్లల్లో బినామీ పేర్లు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీఓ సత్యమూర్తి సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారంలో మూడురోజులు ప్రతి టెక్నికల్ అసిస్టెంట్ మస్టర్లను తనిఖీ చేయాలన్నారు. అలాగే మస్టర్లల్లో బినామీ పేర్లు రాయకూడదన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం, కుళ్లాయిస్వామి, పురుషోత్తంనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, హరి కుమార్, ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేయండి
ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేయాలని ఎంపీడీఓ వాసుదేవరెడ్డి కూలీలకు సూచించారు. వేములపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పని ప్రదేశంలో ఉన్న మస్టర్లను తనిఖీ చేశారు. ఇన్‌చార్జ్ ఏపీఓ, ఈసీ సత్యమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ రవీంద్ర, మేట్లు, కూలీలు ఉన్నారు.

పశువుల దాణా పంపిణీ

పామిడి: ఎద్దులపల్లి పశువైద్యశాలలో బుధవారం పాడి రైతులకు సబ్సిడీ పశువుల దాణా పంపిణీ చేశారు. పశువైద్యాధికారి సాయిసుప్రజ 50 శాతం సబ్సిడీతో పాడిరైతులకు ఈ పశుదాణాను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు గుద్దిటి వీరాంజనేయులు చేతులమీదుగా అందజేశారు. పాడిరైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


పామిడిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు

పామిడి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గోపాలచారి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారి కాంస్య విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం గావించారు.

గార్లదిన్నె: యర్రగుంట్లలో బుధవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాజులు, ఆటల బొమ్మల అంగళ్లు, మిఠాయి అంగళ్లు ఏర్పాటు చేయడంతో గ్రామంలో సందడి నెలకొంది. కబడ్డీ పోటీలు నిర్వహించగా కూడేరు మండలం కలగళ్ల గ్రామానికి చెందిన యువకులు జట్టు ప్రథమ, గార్లదిన్నె మండలం ఎగువపల్లికి చెందిన యువకుల జట్టు రెండో, గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన యవకుల జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

పుట్లూరు: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నదానం చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.


విరగాసిన పెరటి మామిడి చెట్టు

పెరటి మామిడి.. భలే దిగుబడి!

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఎస్‌బీఐ వీధిలో ఉన్న దత్తా క్యాటరింగ్ ఓనర్ బాలసుబ్రహ్మణ్యం ఇంట్లోని మామిడి చెట్టు విరగాసింది. తోటల్లో ఎన్నో రకాల ఎరువులు వేసినా కాపు అంతంత మాత్రంగానే వస్తోందని ఎలాంటి ఎరువులు వేయకుండానే ఎంత బాగా కాసింది అంటూ అటుగా వెళ్తున్న రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గుత్తులు గుత్తులుగా కాయలు కాసిన మామిడి చెట్టును పట్టణవాసులు కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు.


మునిసిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన బోర్డు వద్ద చెత్తను వేసిన దృశ్యం

నిరసనా.. ఆగ్రహమా!

తాడిపత్రిరూరల్: పట్టణంలోని నంద్యాలరోడ్డులో రోడ్డు పక్కన చెత్త వేయొద్దని మునిసిపల్ కమిషనర్ పేరుతో సిబ్బంది ఓ బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తామని అందులో పేర్కొన్నారు. అయితే అధికారులపై కోపమో లేక ఇంటింటి చెత్త వాహనం సక్రమంగా రావడం లేదన్న నిరసనో తెలియదు కానీ బోర్డు వద్ద ప్రజలు చెత్తను వేయడం గమనార్హం. చెత్తను తొలగించకపోవడంతో కోళ్లు, ఇతర జంతువులు చిందర వందర చేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది.